ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

శిక్షలే బహుమానమా ?

- అయ్యా ఎస్.. అనలేక ఐఎఎస్‌ల ఆవేదన
- విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్ బదిలీ వెనుక 'రాజకీయం'
- అధికారుల్లో తీవ్ర చర్చ
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌పైనా ఒత్తిళ్లు



కెఎస్.విశ్వనాథన్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పరిపాలనలో ముక్కుసూటిగా వ్యవహరించే ఐఎఎస్ అధికారులకు బదిలీ ముసుగులో శిక్షలు బహుమతిగా ఉంటున్నాయన్న చర్చ విశాఖ అధికార యంత్రాంగంలో సాగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత యువ ఐఎఎస్ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తాజా బదిలీ వ్యవహారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయి. ఇటీవలే ఈ ఐఎఎస్ అధికారి ఐఅండ్‌పిఆర్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆ బదిలీపై సాగిన తెరవెనుక రాజకీయంపై కలెక్టరేట్, జివిఎంసి, విఎంఆర్‌డిఎ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇక్కడ నుంచి బదిలీపై ఎక్కడికి వెళ్లాల్సి వచ్చినా సరే జిల్లా కలెక్టర్ స్థానానికి ఉద్యోగోన్నతిపై వెళ్లాలి. కానీ ఆయనకు సరైన పోస్టింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. అభివృద్ధి, సంక్షేమంతో సంబంధం లేని ఐఅండ్‌పిఆర్‌కు ఇటువంటి క్రియాశీల అధికారిని వేయడంపై కూటమికి చెందిన నలుగురు ఎంఎల్‌ఎల పాత్ర ఉందన్నది స్పష్టమవుతోంది.

అన్నింటా క్రియాశీలక పాత్ర

కెఎస్.విశ్వనాథన్ విశాఖ జెసిగా, జివిఎంసి అదనపు కమిషనర్‌గా, విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా విశాఖలో సేవలందించారు. పరిపాలన, కార్యనిర్వాహక వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషించారు. భోగాపురం ఎయిర్ పోర్టు కోసం ఆరు ప్రధానమైన రోడ్ల నిర్మాణం, విస్తరణ పనుల నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. ఎయుకు ప్రధాని మోడీ విచ్చేసిన సందర్భంగా అన్ని ఏర్పాట్లూ చూశారు. జిల్లాలో జలవనరులను గుర్తించి సుస్థిర జల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కాపులుప్పాడ, రాంపురం, నరవ వంటి చోట్ల పాతకాలపు చెరువులను పునరుజ్జీవింపజేశారు. కాపులుప్పాడలోగల దేవరవాని చెరువు సహా మిగతా చోట్ల సుమారు 20 చెరువులకు ప్రాణం పోసి దేశంలోనే మంచి పేరు తెచ్చుకున్నారని అధికారులు చెబుతుంటారు. ఒక వేళ బదిలీ అంటూ జరిగితే రాయలసీమలో ఏదో ఒక జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లే జాబితాలో తన పేరుంటుందని, తనకు ఆ అర్హత ఉందని ఆయన అంచనా వేశారు. చివరకు రాజధానిలో ఆయనకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలో పాస్‌పోర్టు అధికారిగా పనిచేసిన ఆయన భార్యను చెన్నయ్ పాస్‌పోర్టు అధికారిగా కూడా ట్రాన్స్‌ఫర్ చేయించారు. చివరకూ ఆయన్నీ ఇక్కడ లేకుండా కొందరు 'రాజకీయం' చేశారు. తుదకు ఆయన నిరాశతోనే రాజధానికి వెళ్లినట్టు అధికారుల్లో చర్చనడుస్తోంది. ఆయన బదిలీ ప్రభావం మిగతా జిల్లా అధికారులపైనా పడింది. జిల్లాలోగల యువ ఐఎఎస్‌లను తీవ్ర కలతకు మిగతా 2లో..

వాల్తేరు రైల్వే డివిజన్‌లో

పలు ప్రాజెక్టులు ప్రారంభం

కర్నూలు నుంచి జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని నరేంద్ర మోడీ ఎపి పర్యటనలో భాగంగా వాల్తేరు డివిజన్‌లో రైల్వే కనెక్టివిటీని పెంచే క్రమంలో గురువారం రూ.1200 కోట్లకుపైగా విలువైన పలు ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనగావించి, జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులలో కొత్తవలస - విజయనగరం నాలుగో రైల్వే లైన్, పెందుర్తి - సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ శంకుస్థాపన వంటివి ఉన్నాయి. కొత్తవలస - బొడ్డవర సెక్షన్, శిమిలిగూడ - గోరాపూర్ సెక్షన్ డబ్లింగ్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. 'ఈ నూతన ప్రాజెక్టులలో కొత్తవలస - విజయనగరం నాలుగో లైన్ రద్దీని తగ్గించడంలో, వేగవంతమైన సురక్షితమైన ప్రయాణాలను అందించడంలో సహాయ పడుతుంది. ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్ల ప్రయాణాన్ని మరింత సులభతరం చేయనుంది. పెందుర్తి - సింహాచలం నార్త్ మధ్య రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం, రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచుతుంది.

పెందుర్తి - సింహాచలం నార్త్ - దువ్వాడ కారిడార్‌లో రైళ్ల కార్యకలాపాలను మరింత వేగవంతం చేస్తుంది. కొత్తవలస - బొడ్డవర సెక్షన్, శిమిలిగూడ - గోరాపూర్ సెక్షన్ మధ్య రైల్వే లైన్ల రెట్టింపు విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుంది' అని అధికారులు చెబుతున్నారు.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచీ రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అప్పగించి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. గురువారం తన పర్యటనలో భాగంగా కమిషనర్ 3, 4 జోన్ల పరిధిలోని 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పనులను పరిశీలించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. స్పెన్సర్స్ జంక్షన్ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త మిగతా 2లో..

బల్క్ డ్రగ్ పార్కు రద్దు చేయాలి

వార్త 8లో..

హత్య కేసు నిందితుడు అరెస్టు

వార్త 3లో..

చెకుముకితో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

వార్త 3లో..



స్టాల్‌లోని వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌పై అవగాహనలో భాగంగా ఈ నెల 16 నుండి 18 వరకు ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ గురువారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. బెలూన్లు ఎగురవేసి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫెస్టివల్ వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు ఒక మంచి ఫ్లాట్ ఫామ్‌గా నిలుస్తుందని అన్నారు. జిఎస్‌టి రిఫార్మ్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విశాఖను మరింత మెరుగైన నగరంగా తీర్చిదిద్దనున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 66 స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో స్టేట్ జిఎస్‌టి అదనపు కమిషనర్ సీతారాం శేఖర్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, యుసిడి పీడీ సత్యవేణి, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రారంభానికి జిఎస్‌టి 2.0 సంస్కరణలపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఐసిడిఎస్ స్వర్ణోత్సవాలను విస్మరించిన ప్రభుత్వాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐసిడిఎస్ స్వర్ణోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విమర్శించారు. గురువారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీల జిల్లా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమీకృత శిశు అభివృద్ధి పథకం 1975లో ప్రారంభమైందని, దీని వల్ల దేశం మొత్తం మీద పేద మహిళలు, పిల్లల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పలు నివేదికలు స్పష్టం చేసినా ఐసిడిఎస్ స్వర్ణోత్సవాలను ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగా విస్మరిస్తున్నట్టు కనబడుతోందని తెలిపారు. ఎంతో కీలకమైన ఐసిడిఎస్ పథకానికి మోడీ ప్రభుత్వం బడ్జెట్ తగ్గించడం ద్వారా నిర్వీర్యానికి పూనుకుందన్నారు. యాప్‌ల పేరుతో అర్హులైన వారిని తొలగించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఐసిడిఎస్‌లో కీలకంగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్వాడీలకు జీతాలు పెంచని కారణంగా కేంద్ర మంత్రుల కార్యాలయాల వద్ద నవంబరులో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారుల సంఖ్య కుదించవద్దని నవంబర్ 14న చిన్న పిల్లలతో అన్ని జిల్లాల్లోనూ ధర్నాలు చేపట్టనున్నామన్నారు. సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్న నేపథ్యంలో వాటి జయప్రదం కోసం అంగన్వాడీలంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, గౌరవాధ్యక్షురాలు పి.మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి, సీనియర్ నాయకులు కె.బృందావతి, కోశాధికారి కె.పద్మావతి, భీమిలి ప్రాజెక్టు కార్యదర్శి శ్రీదేవి, అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి తులసి, పెందుర్తి ప్రాజెక్టు కార్యదర్శి సాయి సరస్వతి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

మొదటి పేజీ తరువాయి..

శిక్షలే బహుమానమా ?

గురిచేస్తోంది.

తీవ్ర ఆవేదనలో కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. విశాఖను రాష్ట్ర ఆర్థిక రాజధానిగా కూటమి ప్రభుత్వం ప్రకటిస్తూ భూములు గుంజుకునే ప్రయత్నాలు ఆయనతో పాటు పలువురు ఐఎఎస్‌లకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నట్టు సమాచారం. ఇప్పుడు వారంతా అంతర్మథనం పడుతున్నారు. 'ప్రభుత్వ విధానం ప్రకారం నడుస్తున్నాం కానీ ప్రజలకు ఏం ప్రయోజనం జరుగుతోంది ? మనం ఏం చేయగలుగుతున్నాం?' అంటూ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తీవ్ర ఆవేదనకు గురౌతున్నట్లు అధికార యంత్రాంగంలో తాజాగా చర్చసాగుతోంది. 99 పైసలకే భూములను కార్పొరేట్, ఐటి, ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేయడంతో వస్తున్న సమస్యలు, ఇటీవల కాలంలో పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజల్లో సాగుతున్న వ్యతిరేకత, గూగుల్‌కి భూములు ఇవ్వబోమంటూ తర్లువాడ గ్రామ పేదరైతుల ఆందోళనలు ఇవన్నీ జిల్లా కలెక్టర్ స్థానంలో ఉన్న హరేంధిరప్రసాద్‌ను అంతర్మథానికి గురిచేస్తున్నాయి. కొన్ని సమస్యలు తలనొప్పిగా మారాయి. వైసిపి మేయర్‌పై జివిఎంసిలో అవిశ్వాసం సందర్భంగా వైసిపి నేతలు వారి కార్పొరేటర్లకు విప్ జారీ చేయడం, ఎన్నికలాధికారిగా నాడు వ్యవహరించిన హరేంధిరప్రసాద్ నిబంధన ప్రకారం వారిని ఓటు వేయకుండా నిలిపేయాల్సి ఉన్నా అధికార ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చిందన్న విషయమూ చర్చనీయాంశంగా మారింది.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు

పేరుకుపోయినట్టు గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించి, బాధ్యులైన షాప్ యజమానులకు జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడంపై ఆయన షాపు యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలకు గౌరవమేదీ ?



మాట్లాడుతున్న కల్యాణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు అధికార మదంతో మహిళలను అవమానించడం అలవాటుగా మారిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం వైసిపి జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 16 నెలల పాలనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల కాలకేయుల్లా మారారని, ముఖ్యమంత్రి చంద్రబాబు అండతోనే ఇంత నీచంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వైసిపి మహిళా నేత కృపాలక్ష్మిపై అత్యంత నీచంగా మాట్లాడిన ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మందుగుండు అక్రమ నిల్వలపై మెరుపు దాడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దీపావళి మందుగుండు అక్రమ నిల్వలపై గురువారం మధ్యాహ్నం ఆనందపురం పోలీసులు మెరుపుదాడులు చేశారు. శొంఠ్యాం గ్రామంలోని గోదాములో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆ గ్రామానికి చెందిన చల్ల గురమ్మను విచారించారు.

యుఎఫ్‌సిలో
ఎపిఎఫ్‌సి బాక్సింగ్‌బే ఈవెంట్ గ్లోబల్ ప్రసారం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : భారత కాంబాట్ క్రీడలకు చరిత్రాత్మక మైలురాయిగా చెప్పబడే ఆంథోని పెట్టిస్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు మాజీ యూఎఫ్‌సి లైట్‌వెయిట్ చాంపియన్ ఆంథోనీ పెటిస్ నేతృత్వంలో బెంగళూరు, విశాఖపట్నం ఆతిథ్య నగరాలుగా ఎంపిక చేశామని యుఎఫ్‌సి చీఫ్ బిజినెస్ ఆఫీసర్ హంటర్ క్యాంప్ బెల్ తెలిపారు. గురువారం విశాఖలో మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 5న ఎపిఎఫ్‌సి ఇండియా బాక్సింగ్ బే 4 మొదట ప్రసార ఈవెంట్స్‌గా ఉంటాయన్నారు. స్పోర్ట్స్ రంగంలో భారత కాంబాట్ కొత్త దశకు నాంది పలుకుతోందని,అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఇస్తుందన్నారు. ఫైటర్లకు ఇది గ్లోబల్ అవకాశాలకు మార్గమన్నారు. అన్నారు. కాంబోట్ స్పోర్ట్స్ ప్రపంచ పటంలో భారతదేశాన్ని కొత్తగా ప్రతిష్టించడమే కాకుండా, స్థానిక క్రీడల అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందన్నారు.

స్టాళ్ల కేటాయింపునకు 22న కలెక్టరేట్‌లో డ్రా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని ప్రస్తుతమున్న 13 రైతు బజార్లతో పాటు, కొత్తగా ఏర్పాటైన చిట్టివలస, ఆరిలోవ రైతుబజార్లలో కూరగాయల విక్రయాలకు స్టాళ్ల కేటాయింపు డ్రా ఈనెల 22న నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ,వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రైతుబజార్లలో 129స్టాళ్లను కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన డ్రా ద్వారా కేటాయిస్తారన్నారు.

రైతులందరూ తమ పేర్లను ఎడిఎం ఆఫీసులో పరిశీలించుకోవచ్చని, మరిన్ని వివరాలకు డోర్ నెంబర్. 8-202/2, అర్.అర్.వి.పురం, గోపాలపట్నం,రైతుబజారు ప్రక్కన, విశాఖపట్నం 530029, ఫోన్ నెంబర్ 9959592474కు సంప్రదించవచ్చని సూచించారు.



వై.సత్యవతి



ఆర్ఎన్.మాధవి



డి.కొండమ్మ



డిడి.వరలక్ష్మి



పి.మాణిక్యం

ఐద్వా రాష్ట్ర కమిటీలో ఐదుగురికి చోటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనంతపురంలో ఇటీవల జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో ఎన్నికైన నూతన కమిటీలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఐదుగురికి చోటు దక్కింది. విశాఖ నుండి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వై.సత్యవతి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆర్ఎన్.మాధవి, డి.కొండమ్మ, అనకాపల్లి జిల్లా నుంచి డిడి.వరలక్ష్మి, పి.మాణిక్యం ఎన్నికయ్యారు. ఉమ్మడి విశాఖలో మద్యంపై సాగిస్తున్న పోరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, అదాని గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా లూలూ మాల్‌కు, గూగుల్‌కు కేటాయించిన భూములను వెనక్కు తీసుకోవాలని చేసిన పోరాటాలను రాష్ట్ర మహాసభ గుర్తించి అభినందించిందని వారు తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తు పోరాటాలు చేపడతామని అన్నారు.

యువత ప్రత్యేక లక్ష్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువత ప్రత్యేక లక్ష్యంతో ముందుకు సాగాలని, అలా కాని పక్షంలో జీవితంలో ఏమీ సాధించలేమని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. నీతి, నిజాయితీగా, మంచి పౌరుడుగా ఉండాలని, సమాజానికి భారం కాకుండా బతకాలని హితవు పలికారు. సెట్విస్, ఎన్‌వైకె ఆధ్వర్యంలో కృష్ణా కాలేజీలో గురువారం జరిగిన యువజనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు సందేశం అందించారు. జీవితంలో ఎదిగేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కష్టపడకుండా ఏదీ రాదని, ఒకవేళ వచ్చినా ఎక్కువ కాలం నిలవదని అన్నారు. చదువుతో పాటు కళలపై యువత దృష్టి సారించాలని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు శ్రమించాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో, కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో సెట్విస్ సిఇఒ కవిత, యూత్ ఆఫీసర్ మహేశ్వరరావు, కృష్ణా కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగికి వాసుపల్లి సాయం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కాలేయం, ఊపిరితిత్తులు సంబంధిత వ్యాధితో మంచాన పడిన 31వ వార్డు కనకాల వీధికి చెందిన కాగిత రామకష్ణకు దక్షిణ వైసిపి ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ వైద్యానికి రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. వార్డు వైసిపి అధ్యక్షుడు దొడ్డిబాపు ఆనంద్ ద్వారా విషయం తెలుసుకొని బాధితుని ఇంటికి నేరుగా వెళ్లి పరామర్శించి, సాయం అందించారు. తానున్నాని భరోసానిచ్చారు. వార్డు మాజీ అధ్యక్షుడు పెంటకోట నాగరాజు, విద్యార్థి నాయకుడు మోహన్, కోడూరు కనకరాజు, పెంటకోట బాబురావు, గంటా శ్రీను, రాము మాస్టారు పాల్గొన్నారు.

తగు జాగ్రత్తలతో ప్రమాద రహిత దీపావళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇంటిల్లిపాది ఇష్టంగా జరుపుకునే దీపావళి పండుగ ప్రమాదరహితంగా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కెజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, తగు సూచనలు చేశారు. పిల్లలను మతాబులు, బాంబులు వంటి పేలే స్వభావం ఉన్న బాణసంచాకు దూరంగా ఉంచడం మంచిదన్నారు. కాకర పువ్వొత్తులు, చిచ్చు బుడ్లు కాల్చే సమయంలోనూ పిల్లల పక్కన పెద్దలుఉండి మార్గదర్శనం చేయాలన్నారు. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ వస్త్రాలు, పాదరక్షలు, కళ్లద్దాలు ధరించడం ద్వారా ప్రమాద తీవ్రత తగ్గించొచ్చన్నారు.

అనుకోని పరిస్థితులలో ప్రమాదం జరిగితే కాలిన శరీర భాగాన్ని పరిశుభ్రమైన చల్లని నీటితో కడిగి, దగ్గరలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి, అత్యవసరమైతే కెజిహెచ్‌కి వెంటనే తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో కాలిన గాయాలకు పూర్తిస్థాయి సదుపాయాలతో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ టి.మోహనరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యబృదం సేవలు అందిస్తోందన్నారు.

నేడు దిశా సమావేశం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన జిల్లాస్థాయి దిశా అభివృద్ధి, మోనటరింగ్ కమిటీ సమన్వయ సమావేశం జరగనుందని జిల్లా పరిషత్ సిఇఒ, దిశా కన్వీనర్ పి. నారాయణమూర్తి గురువారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటి మార్గదర్శకాలు, ప్రయోజనాలపై శ్రీభరత్ సమీక్షించనున్నారని పేర్కొన్నారు.

రగ్బీ విజేత గురుజనాపల్లి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక క్రికెట్ మినీ స్టేడియంలో జరిగిన రగ్బీ లీగ్ పోటీల్లో 12 జట్లు పాల్గొనగా తూర్పు గోదావరి జిల్లా గురజనాపల్లి జట్టు ప్రథమ స్థానంలో, ద్వితీయ స్థానంలో గుంటూరు జట్టు, తృతీయ స్థానంలో మధురవాడ చంద్రంపాలెం జట్టు నిలిచినట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్ కుమార్, కిషోర్, ఉపాధ్యక్షులు నల్ల శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రగతిని సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రుల కు వివరించారు. స్థానిక బి సి వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించి టెన్త్ విద్యార్థుల ఎస్ఎంపి-2 ప్రగతిని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సన్యాసినాయుడుకు వివరించారు. ఎస్ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.రమణ, ఉపాధ్యాయులు సిఆర్‌పి దయాళ్ పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస బొగ్గు రోడ్డులోని శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం ఎన్నారై వైద్యులు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపల్ జె.సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.సింహాచలం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆహారంలో ఉప్పు తగ్గించాలి

ప్రజాశక్తి -పద్మనాభం : ఆహారంలో ఉప్పు తగ్గించుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని సిడిపిఒ ఎం.శ్రీదేవి తెలిపారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న వెలుగు కార్యాలయంలో గురువారం భీమిలి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎనిమిదవ పోషణ మాసం కార్యక్రమాన్ని ఎంఇఒ పి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు వివిధ రకాల వంటలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపిఅధ్యక్షులు కె.రమణ జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, నాయకులు కె.నగేష్‌కుమార్, సూపర్‌వైజర్లు బేగం, పార్వతి, కార్యకర్తలు లక్ష్మీ, శ్రీదేవి, కె.లీలావతి, ప్రభావతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర స్టేషనరీని గురువారం పంపిణీ చేశారు. దాత దుబాయ్‌కి చెందిన లక్కొజు శేషాద్రి కుమారుడు రిషిరామ జన్మదినం సందర్భంగా 70 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, చాక్లెట్లు బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోవింద్ కుమార్, స్థానిక నాయకులు కోరాడ నాయుడుబాబు, ఎర్ర బంగారు నాయుడు (బన్నీ), డబ్బీరు విజయ్ కుమార్, కోరాడ తమ్ము నాయుడు, డిపి రాజు, బుత్తల కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 నుంచి గౌరీపౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి-మాధవధార : గౌరీ పౌర్ణమి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీ నుంచి రెండు వారాలు పాటు నిర్వహించనున్నట్లు సనపల అమ్మలు తెలిపారు. గురువారం మాధవధార ప్రాంతంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉత్సవ కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో సనపల సత్యనారాయణ, కెవిఆర్ మూర్తి, కూన భవాని శంకర్, పేడాడ చిరంజీవి, సనపల వెంకటరావు, కంచరాన హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లుపై దౌర్జన్యం ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-మధురవాడ/కొమ్మాది : పొట్టకూటి కోసం ఎవరికి ఇబ్బంది లేకుండా ఫుట్‌పాత్ మార్జిన్ వదిలేసి తోపుడు బండ్లు, నేలపైన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న పేదలపై దౌర్జన్యం, దాడులు ఆపాలని విశాఖ జిల్లా తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. గురువారం మిథిలాపురి వుడా కాలనీలో తోపుడు బండ్లపై ఉన్న సరుకులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, సెక్రటరీలు స్వాధీనం చేసుకొని తరలిస్తున్న వాహనానికి అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. తమ సామాన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించడంతో పిఎం.పాలెం పోలీసులు వచ్చి చర్చించి ఎవరి సామాన్లు వారికి తిరిగి ఇప్పించారు. అనంతరం సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ మాట్లాడుతూ, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు వచ్చి అమ్మకానికి తెచ్చుకున్న సరుకులు, సామానులు దౌర్జన్యంగా తీసుకుపోతూ చిరువ్యాపారులను లూటీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లను పెట్టుకున్నా ఇలా దౌర్జన్యానికి పాల్పడటం తగదన్నారు. హాకర్ జోన్లు ఏర్పాటుచేసే వరకు తోపుడు బండ్ల కార్మికులు వర్తకం కొనసాగిస్తారని, మున్సిపల్, పోలీసు అధికారులు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మికులు పాల్గొన్నారు.



మిథిలాపురికాలనీలో నిరసన తెలుపుతున్న తోపుడు బండ్ల కార్మికులు

చెకుముకితో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం



చెకుముకి పోస్టర్లను విడుదలచేస్తున్న ఎంఇఒ రమణ

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు, పోటీ పరీక్షలను పరిచయం చేసేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి పరీక్షలు దోహదం చేస్తాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి పేర్కొన్నారు. రేవిడి వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఇఒ -1 పి.వి.రమణ చెకుముకి పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1వ తేదీన మండల స్థాయి, డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అన్ని రకాల యాజమాన్యాలకు చెందిన ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెకుముకి పరీక్షల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బోణి చిన్నారావు, జన విజ్ఞాన వేదిక సభ్యులు దెందేటి రాజు, ములపర్తి రామకృష్ణ, బోను భీష్మ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంవి.రావుకు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారం

ప్రజాశక్తి - ఆరిలోవ : భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ భారతీ విద్యాసంస్థ అధినేత ఎంవి.రావుకు ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారాన్ని అందజేశారు. శ్రీసత్యసాయి దివ్యామృతం ఆధ్వర్యంలో నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ ఎం.ముత్యాలనాయుడు అధ్యక్షతన విజయనగరం జిల్లా, గజపతినగరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో విశేషమైన కృషి చేస్తూ సామాజిక సేవాభావం కలిగిన ఎంవి.రావుకు పురస్కారాన్ని ముఖ్యఅతిథిలు దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి బి.విజయభాస్కర్ అందజేశారు. ఇంతటి గౌరవ ప్రదమైన పురస్కారాన్ని అందజేసిన అతిథులకు ఎంవి.రావు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ కరస్పాండెంట్ పురస్కారాన్ని అందుకున్న ఎంవి.రావుకు భారతీ స్కూలు ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల అధినేత పావని చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంవి.రావుకు పురస్కారాన్ని అందజేస్తున్న ముఖ్య అతిథులు

'కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలి'

ప్రజాశక్తి-మధురవాడ : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎండాడలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజాపాలన లేదన్నారు. రాష్ట్రంలో పేదవాడికి విద్య, వైద్యం అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేస్తే పేదలకు వైద్యం ఎక్కడ అందుతుందని ప్రశ్నించారు. రైతులు యూరియా వాడితే కేన్సర్ వస్తుందని, మద్యం తాగితే ఆరోగ్యంగా ఉంటారన్నది చంద్రబాబు స్లోగన్‌లా ఉందని విమర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, అక్కరమాని రామునాయుడు, జగ్గుపల్లి ప్రసాద్, అక్కరమాని మంగరాజు, అల్లిబిల్లి నరసింగరావు, పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి పెదబాబు పాల్గొన్నారు.

75 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆనందపురం: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గండిగుండంలో గురువారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో సత్యసాయి సేవా సంస్థలు విశాఖపట్నం జోన్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 75 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 21మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా చేయించేందుకు ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేత్రాలు అత్యంత ముఖ్యమైనవని, చిన్న సమస్య తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శౌంర్యా పిఎసిఎస్ చైర్మన్ గండ్రెడ్డి స్వామినాయుడు, సత్యసాయి సేవ సంస్థల విశాఖపట్నం జోన్ కో-ఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, పంచాయతీ కార్యదర్శి పి.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-సీతమ్మధార: నందగిరినగర్‌లో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి కె.లక్ష్మణమూర్తి కేసు వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం, నందగిరినగర్‌కు చెందిన కావల శ్రావణసంధ్య (33) అలియాస్ సోనీకి మణికంఠతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో శ్రావణ సంధ్య గత ఏడేళ్లుగా భర్తకు దూరంగా ఉంటుంది. ప్రస్తుతానికి ఆమె భర్త మణికంఠ రాయగడలో ఉంటున్నాడు. ఈ తరుణంలో బుధవారం సాయంత్రం శ్రావణ సంధ్యను అదే వీధిలో ఉంటున్న కార్పెంటర్ శ్రీను పదునైన కత్తితో దాడి చేసి మెడపై కోయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు సంఘటనా స్థలం నుండి పారిపోగా కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులు శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి అక్క దేవి సంతోషి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలు శ్రావణ సంధ్య, నిందితుడు శ్రీనుకు గత ఎనిమిది నెలలుగా బైక్ పార్కింగ్ విషయంలో గొడవలు ఉన్నట్టు ఎసిపి వెల్లడించారు. అందులో భాగంగా మతురాలు బైక్ సీట్ కవర్‌ను నిందితుడు కోసివేయడంతో ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైందని, అప్పటినుండి ఇద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం శ్రీను హత్య చేసినట్టు వివరించారు. హత్య అనంతరం నిందితుడు పరారయ్యాడు. అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా రైల్వే స్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

కొద్ది నెలలుగా తనతో శ్రీను గొడవపడుతూ, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని మృతురాలు స్థానిక పోలీసులను పలుమార్లు ఆశ్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు. సకాలంలో పోలీసులు స్పందించి శ్రీనును హెచ్చరించి ఉంటే నిండు ప్రాణం బలయ్యేది కాదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సమావేశంలో సిఐ ఉమాకాంత్, ఎస్ఐలు వెంకటరావు, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతుని పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలోని అనంతపద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీమాధవస్వామి ఆలయంలో గురువారం నుండి ఆదివారం వరకు అనంతుని పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో నరసింహరాజు గురువారం తెలిపారు. ఆలయానికి సమీపంలో ఉన్న కృష్ణాపురం, పద్మనాభం, మద్ది, వికె.పాలెం, రెడ్డిపల్లి గ్రామాలతో పాటు వివిధ పట్టణాలనుండి భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ హైస్కూళ్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువుపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి.పురం హెచ్ఎం వి.శంకరరావు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -భీమునిపట్నం : దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో భీమిలిలో జరిగిన హిందీ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించారని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు గురువారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక కోర్సుల్లో ఐదు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. స్థానిక పిఎస్ఎం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు 42 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇటీవల విడుదలైన ఫలితాల్లో 41 మంది ప్రథమ శ్రేణిలోనూ, పరిచయ విద్యార్థి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఘనంగా ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో గురువారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని నిర్వహించారు. సిపిఆర్ పట్ల ప్రజలకు అనస్థీషియా వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించారు. గుండె పోటు వచ్చిన సందర్భాల్లో తక్షణ చర్యలు ఏవిధంగా చేపట్టాలో వివరించారు. ఈనెల 13 నుండి 17వ తేదీ వరకు సిపిఆర్ అవగాహన వారంలో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒడి డాక్టర్ పద్మా అమర్ విశాల్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చెంచి రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, ప్రిన్సిపల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణ ప్రకాష్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పెందుర్తి : విశాఖ నగరంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. కార్మికనగర్‌లో గురువారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు 29 రాష్ట్రాల నుండి 1500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల నుండి కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. ఫలితంగా కార్మికుల సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసుకునే హక్కు జీతభత్యాలు బేరం ఆడుకునే హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ లన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడం అన్యాయం అన్నారు. సిఐటియు ఏర్పడ్డ 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయని, దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహాసభల చివర రోజైన జనవరి 4వ తేదీన లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని వివరించారు. మహాసభల సందర్భంగా రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తా మని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి విశాఖ నగరంలో ఉన్న కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.జగన్, జోన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, నాయకులు కె.అప్పలనాయుడు, జి.శంకరరావు, కాలనీ నాయకులు ప్రభ దేవా, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగ్గునాయుడు

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి : గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే గణబాబు ఆదేశించారు. జివిఎంసి జోన్-6, జోన్-8 అధికారులతో వార్డుల్లో సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్లు, సిసి రోడ్లు, బిటి రోడ్లు, యుజిడి, నీటి సరఫరా, విద్యుత్ పనులను పూర్తిస్థాయిలో చర్చించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు, 5కె రన్ పోటీలు డిసెంబర్‌లో నిర్వహించనున్న సందర్భంగా పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు శంకరరావు, రాము, వాటర్ సప్లై ఎస్ఇ కె.శ్రీనివాస్, కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న చరణ్

శంకర్ ఫౌండేషన్‌లో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధిలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చరణ్ మాట్లాడుతూ, తడి పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలని, ప్లాస్టిక్ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, కాలానుగుణ వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అక్కడక్కడ ఉన్న వ్యర్థాలను శుభ్రపరచాలని, పరిసరాలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వంట గదిని కూడా పరిశీలించి పలుసూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, ఏదైనా వైద్య సహాయం కోసం సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని ప్రిన్సిపల్, సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఆహార పదార్థాలను వేడి స్థితిలో వడ్డించాలని, రక్షిత నీటిని అందించాలని సూచించారు. ఈ సందర్భంలో జిల్లా ఎపిడిమిక్ సిబ్బంది, మలేరియా సిబ్బంది, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న జనసేన నాయకులు

వేపగుంట - పినగాడి రోడ్డుకు సహకరించాలి

ప్రజాశక్తి-వేపగుంట : వేపగుంట- పినగాడి రోడ్డు విస్తరణకు రెవెన్యూ అధికారులు సహకరించాలని జనసేన నాయకులు పిన్నింటి పార్వతి, తాపట్ కిశోర్ కోరారు. ఈ మేరకు పెందుర్తి తహశీల్దార్ వెంకట అప్పారావును కలిశారు. రహదారి విస్తరణకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. రెవెన్యూ పరంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మానవతా విలువలపై సెమినార్

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం మానవతా విలువలపై సెమినార్ నిర్వహించారు. దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ సెమినార్‌ను ప్రారంభించి మాట్లాడారు. మానవతా విలువలే వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను నిలబెడతాయన్నారు. విలువలు ఆధారంగానే మనిషి ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ జివి.ప్రదీప్‌వర్మ, బి.జీవన్‌రావు పాల్గొన్నారు.

ప్లైవుడ్ కార్మికుల కూలిరేట్లు పెంచాలి



లేబర్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్లైవుడ్ ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లైవుడ్ ముఠా కార్మికులకు నాలుగేళ్లు అయినా కూలి రేట్లు యాజమాన్యం పెంచడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఇళ్లలో అనారోగ్యంతో బాధపడేవారికి మందులు కొనలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కూలి రేట్లు పెంచాలని డిసిఎల్‌కు రెండు నెలల క్రితం విన్నవించుకున్నామని తెలిపారు. ఎప్పుడు ఆఫీసుకు వెళ్లినా ఆయన అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్మికులకు డిసిఎల్ అందుబాటులోకి రావాలని కోరారు. ఇప్పటికైనా యాజమాన్యంతో డిసిఎల్ మాట్లాడి జాయింట్ మీటింగ్ వేసి ప్లైవుడ్ కార్మికుల కూలి రేట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు వై.రాజు, చిన్నారావు, వెంకట్రావు, చంటి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-వేపగుంట : పెందుర్తి ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎలక్షన్ డిటి అర్జునరావు మాట్లాడుతూ, ఓటరు జాబితాలో తప్పులను ఎలా సరిచేయాలి, మరణించిన వారిని ఏ విధంగా తొలగించాలి, కొత్త ఓటర్ల నమోదుపై సచివాలయ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం

ప్రజాశక్తి -గోపాలపట్నం : దొంగతనాలు, నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ జోన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రమౌళి చెప్పారు. దొంగతనాలు, నేరాలు పట్ల గోపాలపట్నం రైతు బజార్ వద్ద గురువారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు మనీ పర్సులు పోయేటప్పుడు బాధితులు ఎట్లా వ్యవహరించాలో వివరించారు. రైతు బజార్‌లో వీలైనన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ జీతేశ్వరరావు, రైతుబజార్ ఈవో ప్రసాదు, క్రైమ్ పోలీసులు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకునికి ఆశ్రయం

ప్రజాశక్తి-పెందుర్తి : మానసిక సమస్యలతో బాధపడుతున్న యువకునికి ఆశ్రయం కల్పిస్తూ పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కెవి.సతీష్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. విశాఖపట్నం హెచ్‌బి.కాలనీ, సింహాద్రిపురం ప్రాంతానికి చెందిన చింతల ప్రేమ్‌కుమార్ (35) చిన్నప్పటి నుంచే మతిస్థిమితం కోల్పోయి జీవనం సాగిస్తున్నాడు. తండ్రి ఇరవై ఏళ్ల క్రితమే అనారోగ్యంతో చనిపోగా, తల్లి ఇటీవల కిడ్నీ వ్యాధితో మరణించడంతో అతను నిరాశ్రయుడయ్యాడు. ప్రేమ్‌కుమార్ పరిస్థితిని గమనించిన పెందుర్తి సాయి హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడిశ్రీను విషయాన్ని పెందుర్తి ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ పెందుర్తిలోని ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకుడు దొడ్డి ప్రకాశ్‌తో మాట్లాడి ఆ యువకుడికి ఆశ్రయం కల్పించారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో షిప్ డిజైన్ వర్క్ షాప్

ప్రజాశక్తి- కరాస: స్వావలంబనను ప్రోత్సహించడానికి, స్వదేశీ నౌక రూపకల్పన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి షిప్ డిజైన్ వర్క్ షాప్‌ను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ప్రధాన నావికా పరిశోధన ప్రయోగశాల అయిన నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) గురువారం నిర్వహించింది. భారతదేశ స్వదేశీ నౌక రూపకల్పన సామర్థ్యాలను బలోపేతం చేయడం, భారత నౌకాదళం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు (డిపిఎస్‌యులు), ప్రైవేట్ షిప్‌యార్డులు, పర్గీకరణ సంఘాలు, విద్యాసంస్థల నుండి వాటాదారుల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపును డిఆర్‌డిఒ విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వి.హరప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. నావికా వ్యవస్థలో ఆత్మనిర్భర్ సాధించడంలో స్వదేశీ నౌక రూపకల్పన, ఆవిష్కరణల కీలక పాత్రను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎఐఎంఎల్) సాధనాలు, డిజిటల్ ట్విన్ భావనలు, మెటా - మెటీరియల్స్, అధునాతన స్టెల్త్ డిజైన్ పద్ధతులు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను భవిష్యత్ నౌక రూపకల్పన ప్రక్రియల్లో అనుసంధానించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రపంచ పర్యావరణ, కార్యాచరణ ప్రమాణాలకు అనుగుణంగా నావికా రూపకల్పనను సమలేఖనం చేయడానికి గ్రీన్ షిప్ టెక్నాలజీస్, ఇంధన-సమర్థవంతమైన ప్రొపల్షన్ సిస్టమ్స్, స్థిరమైన పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు.

ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ, నీటి అడుగున వ్యవస్థలు, ఓడ హైడ్రోడైనమిక్స్, స్టెల్త్ టెక్నాలజీలలో ప్రయోగశాల సహకారాన్ని వివరించారు. ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి సాంకేతిక ఆవిష్కరణల కోసం ప్రాంతాలను గుర్తించడానికి డిజైనర్లు, ఓడల నిర్మాణదారులు, వర్గీకరణ సంఘాలు, విద్యావేత్తల మధ్య సంభాషణకు ఈ వర్క్ షాప్ ఒక ప్రత్యేకమైన వేదికను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్షిప్ డిజైన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ రియర్ అడ్మిరల్ సుజిత్ బాక్షీ, గిరిదీప్ సింగ్ రాధా కృష్ణ, హైడ్రోడైనమిక్స్ రీసెర్చ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



షిప్ డిజైన్ వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న ఎన్ఎస్‌టిఎల్ ప్రతినిధులు

అసంపూర్తి రోడ్లను పూర్తి చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-దేవరాపల్లి : అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్లను వెంటనే పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లుకు ప్రభుత్వం బిల్లులు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. మండలంలోని పూలగరువు, బుచ్చంపాలెం గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లు వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యాన అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దొర మాట్లాడారు వాలాబు పంచాయతీలో పూలగరువు, రామన్నపాలెం, బుచ్చంపాలెం, బొడ్డగుమ్మి కోనాం, కోడాపల్లి, బొర్రచింత, తుమ్మలపాలెం గ్రామాలకు సుమారుగా రూ.12 కోట్లుతో రోడ్లు మంజూరు చేసి పనులు చేస్తే కేవలం కోటి 70 లక్షలు రూపాయలు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దీంతో ఈ రోడ్ల పనులు నిలిచిపోయాయన్నారు. వీరభద్రపేటకు రూ.84 లక్షలతో బిటి రోడ్డు మంజూరైతే ఎర్త్ వర్క్ చేసి అసంపూర్తిగా నిలిచి పోయిందని పేర్కొన్నారు. నేరెళ్ళపూడి, బోడిగరువు, మదనగరువు గ్రామాలకు రూ.1.90 కోట్లుతో రోడ్లు మంజూరు కాగా, అవి కూడా అసంపూర్తిగా నిలిచిపోయినట్టు చెప్పారు. ప్రస్తుత వర్షాకాలొంలో గిరిజనులు నిత్యావసర సరుకులకు, 104, 108 వాహనాలు రాలేని పరిస్థితితో రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి రోడ్లను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూడ దేముడు, కూడా ఈశ్వరరావు, కదల గణేష్, సోముల రమణ బాబు, దుప్పి సోమయ్య, దుప్పి దాసు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తి రోడ్డుపై ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న పిఎసిఎస్ చైర్మన్లు

ఎమ్మెల్యే రాజుకు సన్మానం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట, బంగారు మెట్ట, పొట్టిదొరపాలెం, బుచ్చయ్యపేట, తురకలపూడి పిఎసిఎస్ చైర్మన్లు గురువారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోటా సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, దొండా శ్రీను, విరోధి సత్తిబాబు, దొడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మునగపాక : వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని వెంకటాపురం గ్రామంలో వైసిపి నాయకులు గురువారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు వైద్య కళాశాలలను ధారాదత్తం చేయడానికి కుట్ర చేస్తుందన్నారు. ప్రజల నుండగి కోటి సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, ఉపసర్పంచ్ సాయి వజ్రం, బొడ్డేడ లిల్లీ, రేపాక బాబురావు, దలై రామారావు, చిన్ని రాము, పండూరి నూకరాజు, కరణం రామకృష్ణ, బుద్ధరాజు గోపాలరాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి


మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని జెడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామపంచాయతీని ఆయన గురువారం సందర్శించారు. గ్రామపురవీధుల్లో డ్రైనేజీలను, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి బిన్ను బ్యాగ్ సిస్టం ద్వారా నిల్వ ఉంచిన పొడి చెత్తను సేకరించాలన్నారు. ప్రభుత్వం త్వరలో పొడి చెత్తకు నిత్యవసర సరుకులు అందజేసే కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. గ్రామ సంఘాల నుండి సిఆర్‌పిలను నియమించి ప్రతి 50 కుటుంబాలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించాలన్నారు. మ్యాజిక్ డ్రైన్‌లపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అమృతపురంలో కోతులు రైతుల పంటలను ధ్వంసం చేస్తున్నాయని సిఈఓ దృష్టికి తీసుకెళ్లగా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చి కోతులను పట్టించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో పి.పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, సర్పంచ్‌లు సబ్బవరపు నారాయణమూర్తి, మామిడి శంకర్రావు, బోను గంగునాయుడు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, గవర రాజు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లలకు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అనంతరం గర్భిణులకు ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి, పిఓ వి.లలిత కుమారి, సర్పంచ్‌లు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మామిడి లక్ష్మి కొండాజీ, ఎంపీడీవో పి.పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో చైతన్య, సర్పంచులు సబ్బవరపు నారాయణమూర్తి, పడాల వెంకటరమణ, ఎంపిటిసి కర్రి అప్పారావు, గవర రాజు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ క్రీడా మైదానం ఉనికి ప్రశ్నార్థకం

- ప్రదర్శన స్థలంగా మార్చేసిన వైనం
- కాసుల కక్కుర్తితో అద్దెలకు ఇస్తున్న జివిఎంసి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక ఎన్టీఆర్ క్రీడా మైదానం ఉనికి ప్రశ్నార్థకంగా మారిందంటే అతిశయోక్తి కాదు. క్రీడలకు నిలయంగా ఉండాల్సిన ఈ మైదానం క్రమంగా ప్రదర్శనల వేదికగా మారిపోతుండటం ఔత్సాహిక క్రీడాకారులను కలవరపెడుతోంది.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అప్పట్లో క్రీడలకు అనువుగా ఎన్‌టిఆర్ స్టేడియంలో గ్యాలరీను నిర్మించి ఒక లుక్ తెచ్చారు. మంత్రిగా కొణతాల రామకృష్ణ ఆపై అనేక విధాలుగా గ్రౌండ్‌ను తీర్చిదిద్దారు. క్రీడల కోసం జిల్లా కేంద్రంలో ఉన్న ఈ ఒక్క మైదానాన్ని కూడా క్రీడల కన్నా ప్రదర్శనలు, ఎగ్జిబిషన్‌లు, ఇతర వాణిజ్య కార్యక్రమాల కోసం ఎక్కువగా వినియోగిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కాసుల ఆశతో ఈ మైదానాన్ని అద్దెకు ఇస్తున్నారు. దీంతో క్రీడామైదానం రూపురేఖలు దెబ్బతిని పోతున్నాయి. ఈ మైదానాన్ని మళ్ళీ యథాస్థితికి తేవాలంటే ప్రజాధనం లక్షల రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. అయినా అసలు క్రీడలకు అనువుగా తిరిగి మార్చడం కష్టమవుతుందని క్రీడా ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎన్‌టిఆర్ క్రీడా మైదానం

జిల్లాలో కలెక్టర్, క్రీడాశాఖ ఉన్నా కూడా క్రీడలకు ప్రోత్సాహం లేకపోవడం బాధాకరమని స్థానిక క్రీడాకారులు వాపోతున్నారు. క్రీడా మైదానం బదులు ప్రదర్శన మైదానంగా మారిపోతే క్రీడాభివృద్ధి లక్ష్యాలు నీరుగారిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ మైదానం క్రీడలకే కేటాయించాలని కోరుతున్నారు. లేకుంటే అనకాపల్లి యువతలో ప్రతిభ వెలికి తీసే వేదికే మాయమవుతుందనే భయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎన్‌టిఆర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడలకు వినియోగించాలని పలువురు క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అయినా క్రీడా ప్రోత్సాహం ఏదీ?

అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారింది. ఎప్పటినుంచో ఉన్న ఎన్టీఆర్ క్రీడామైదానం జిల్లా అయ్యాక బాగుపడతాదనుకుంటే ఉనికే కోల్పోతుంది. కలెక్టర్, క్రీడా శాఖ ఉన్నా ప్రయోజనం లేదు. గ్రౌండ్‌ను పాడు చేయడం వల్ల ఆటలకే అనువుగా లేకుండా పోయింది.

- నాగార్జున, క్రికెట్ లీగ్ ప్లేయర్, అనకాపల్లి

స్థానిక నాయకులు పట్టించుకోవాలి

మైదానంలో నిరంతరం ఏదో ఒక ఎగ్జిబిషన్ కానీ, ఇతర కార్యక్రమాలకు కానీ నెలలు తరబడి ఇచ్చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కాసులకు కక్కుర్తి పడితే మైదానం స్వరూపం కోల్పోయేలా చేశారు. లక్షల ప్రజాధనం వృథా అవుతుంది. స్థానిక నాయకులే పట్టించుకోవాలి.

- ఉగ్గిన శ్రీను, క్రికెట్ లీగ్ ప్లేయర్, అనకాపల్లి

పార్టనర్ షిప్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : నవంబరు 14, 15 తేదీలలో విశాఖపట్నంలో సిఐఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్టనర్ షిప్ సమ్మిట్-2025కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి కలెక్టరు కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజరు ఎస్.నరశింహరావు, డిజెడ్ఎం సూర్యనారాయణ, జనరల్ మేనేజరు ప్రసాదు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-2011లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేసారు. గురువారం ఉదయం ప్రధానోపాధ్యాయులు ఎంఎన్.యస్.ప్రశాంతి చేతుల మీదగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్ మాణిక్యం, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ ఉద్యోగుల కోసం శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై ఈ గ్రీవెన్స్‌లో దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు. గత నెలలో జరిగిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో వినతి పత్రాలను అందజేసిన ఉద్యోగులు సైతం నేడు జరిగే గ్రీవెన్స్‌కు హాజరై, తమ అర్జీపై అధికారులు తీసుకున్న చర్యలను సైతం తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ గ్రీవెన్స్ కి జిల్లా అధికారులంతా సకాలంలో హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థి అదృశ్యం



ప్రజాశకి-పరవాడ : పరవాడ రామాలయం వీధికి చెందిన పూలపల్లి లక్ష్మణరావు కుమారుడు సుధీర్ (15) అదృశ్యమయ్యారు. ఈ మేరకు తల్లిదండ్రులు పరవాడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. సుధీర్ పరవాడ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో స్కూల్‌కి వెళ్తానని చెప్పి యూనిఫాం ధరించి బ్యాగ్‌తో ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి మందలించడంతో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుధీర్ ఎత్తు సుమారు 5 అడుగులు 4 అంగుళాలు, చామన చాయ, సన్నగా శరీరం, కుడి కనుబొమ్మపై గాటు, ఎడమ చేతికి బ్లాక్ రింగ్ ఉంది. బ్యాగ్‌లో బ్లూ కలర్ ఎన్‌సిసి స్పోర్ట్స్ ట్రాక్ డ్రెస్ (అపర్, లోవర్) తీసుకెళ్లాడు. బాలుడు ఆచూకీ తెలిసినవారు సిఐ, పరవాడ పోలీస్ స్టేషన్ : 94407 96038, తల్లిదండ్రులు : 63023 23262, 70933 40235 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మండలంలోని కొత్తూరు, పిసినికాడ గ్రామాలలో శ్రీమరిడిమాంబ అమ్మవారిని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రమాదాలపై ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. బస్సు డ్రైవర్లకు, కండక్టర్లకు, సెక్యూరిటీ స్టాఫ్‌కు పలు సూచనలు చేశారు. బస్‌లను ఎక్కడ పడితే అక్కడ నిలుపుదల చేయవద్దన సూచించారు. ప్రయాణికులను వేలాడే విధంగా ఎక్కించుకోవద్దన్నారు. ఇటీవల అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డు ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మరణించాడని, కేసు నమోదు చేశామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం ప్రవీణ పాల్గొన్నారు.


ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న సిఐ వెంకటనారాయణ



కేక్ కట్ చేస్తున్న విఒఎల సంఘం నేత, కూటమి నాయకులు

కాలపరిమితి సర్క్యులర్ రద్దుపై విఒఎల హర్షం

ప్రజాశక్తి-యస్.రాయవరం : విఒఎలకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయడంపై విఒఎలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని అడ్డురోడ్డు ఫ్లై ఓవర్ కింద విఒఎలు, కూటమి నాయకుల సమక్షంలో కేకు కట్ చేసి థాంక్స్ సీఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఫ్లై ఓవర్ నుండి అడ్డురోడ్డు పాత నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంగా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షులు మేజర్ల వినోద్ రాజు, టిడిపి మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేష్, కొరుప్రోలు పిఎసిఎస్ అధ్యక్షుడు గుర్రం రామకృష్ణ, టిడిపి నాయకులు నల్లపరాజు వెంకటరాజు, బొలిశెట్టి గోవిందరావు, సోమిరెడ్డి రాజు, కోన అప్పలరాజు, విఒఎలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక 33/ 11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పలు విభాగాల నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.కోటపాడు, కింతాడ, దాలివలస, మర్రివలస, గొట్లాం, కె.సంతపాలెం, మేడిచర్ల, ఆర్ఎన్.పాలెం, పైడంపేట, ఏ.భీమవరం తదితర గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజల సహకరించాలని కోరారు.

నేడు, రేపు మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట డిపిఎన్ హైస్కూల్‌లో శుక్ర, శనివారాల్లో మండల స్థాయి ఆటలు పోటీలు జరగనున్నాయి. ఇందులో భాగం పీడీలతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం ఎన్.ప్రసాదరావు మాట్లాడుతూ శుక్రవారం బాలురుకు, శనివారం బాలికలకు కబాడీ, ఖోఖో, షెటిల్, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో గెలిపొందిన వారు డివిజన్ స్థాయికి ఎంపికవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీలు పి.కమల, రాజా తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఈ నెల 17, 18 తేదీల్లో పాయకరావుపేట జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఎంఇఒ జి.రమేష్‌బాబు తెలిపారు. దీనిపై గురువారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం జాన్ రవి, కాన్వెన్సీ ఇంఛార్జి రవికుమార్, మండల కోఆర్డినేటర్ వై డి శ్యామ్ కుమార్, ఎన్ రవికుమార్, ఎస్ కె రహీం, కె ఎస్ స్వామి, కొండలరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మునగపాక : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18 తేదీల్లో జరుగు మండల స్థాయి ఆటల పోటీలకు ప్రత్యేక అతిథిగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను స్కూల్ కమిటీ, ఉపాధ్యాయులు గురువారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సూర్యచంద్ర రామారావు, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగం నుండి 6 నుండి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు ఈనెల 17 నుండి 18 వరకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్, పీడీ బహిరుద్దీన్, ఉపాధ్యాయులు పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న దృశ్యం

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య వాడివేడిగా సాగింది. గత సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిని అధికారులు వివరిస్తుండగా, స్త్రీనిధి ఖాతా తప్పనిసరిగా ఉండాలని పెట్టిన నిబంధన ఏమిటి? అంటూ రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి ప్రశ్నించారు. అక్రమ కలప రవాణాపై చర్యలు తీసుకోవాలని జెడ్పిటీసీ కర్రి సత్యం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ స్వర్ణలతను కోరారు. మద్యం కౌంటర్ సేల్స్‌లో ఎంఆర్పీపై పది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు మండిపడ్డారు. ఏ.కొత్తపల్లి హైస్కూల్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించలేదని ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ అసహనం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాల మెయింటెనెన్స్ కోసం ఉంచిన రూ.2,000 చొప్పున నిధులు పాఠశాలలకు చేరలేదని సర్పంచులు ప్రశ్నించడంతో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వివాడం చోటుచేసుకుంది. ఈ సమయంలో వైసిపి సర్పంచ్ బూరె బాబురావు సహా వైసిపి సర్పంచ్లు, ఎంపీటీసీలు విద్యాశాఖ వివరణ ఇవ్వాలంటూ నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సభ కొంతసేపు నిలిచిపోయింది. చివరికి అధికారులు వివరణ ఇవ్వడంతో సమావేశం మళ్లీ పున:ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎంవి.సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలం నాయుడు, ఉగ్రోకుల గంగాభవాని, అగ్రికల్చర్ ఆఫీసర్ ఎల్‌వై. కాంతమ్మ, హార్టికల్చర్ ఆఫీసర్ కిరన్మయి, వేచలం పిహెచ్సి వైద్యాధికారిణి శకుంతల, వెలుగు ఏపీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పొడియం ఎదుట బైఠాయించిన వైసిపి ప్రజాప్రతినిధులు

లైసెన్స్ రద్దు చేశారు.. జీవనోపాధి ఎలా?

బాణసంచా తయారీదారుల ఆవేదన

ప్రజాశక్తి-సబ్బవరం : బాణసంచా తయారీ లైసెన్సు ప్రభుత్వం వారు రద్దు చేశారని, జీవనోపాధి ఎలా కొనసాగించాలని బాణసంచా తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం అయ్యప్ప ఫైర్ వర్క్స్ యజమాని దాసరి అంకులు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని మొగలిపురంలో 25 ఏళ్లుగా అయ్యప్ప ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు చెప్పారు. తయారీ కేంద్రంలో రెండు షెడ్లు నిర్మించి ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ బాణసంచా తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం వారు తమ బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి తమ లైసెన్స్‌ను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏడాదికి ఒకసారి వచ్చే దీపావళి పండుగకు బాణసంచా తయారుచేసి విక్రయిస్తామని, ఇప్పుడు లైసెన్స్ రద్దు చేయడంతో బాణసంచా తయారీ నిలిచిపోవడంతో జీవనోపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ లైసెన్స్ రద్దు చేస్తే హైకోర్టుకు వెళ్లి లైసెన్స్ మళ్ళీ తెచ్చుకున్నామని, ఇప్పుడు దీపావళికి వారం రోజులు ముందు లైసెన్స్ రద్దు చేయడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదన్నారు. కాలవ్యవధి తక్కువ ఉండడంతో తాము కోర్టును ఆశ్రయించలేకపోయామని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు తమ గోడును పట్టించుకోవాలని, లైసెన్స్ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

'ప్రతిభ'కు జాతీయ స్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరంలో విద్య, క్రీడలు, విలువలు, ఆవిష్కరణలతో సమగ్ర విద్యా విధానాన్ని అమలు చేస్తున్న ప్రతిభ విద్యాలయానికి దేశవ్యాప్తంగా గర్వించదగిన గుర్తింపు లభించిందని ప్రతిభ విద్యాలయం కరెస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ ర్యాంకింగ్ 2025లో భారతదేశంలోని అగ్ర 1000 పాఠశాలల్లో ఒకటిగా ఎంపిక కావడం పాఠశాలకు విశేష గౌరవాన్ని తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన పాఠశాల ర్యాంకింగ్ వ్యవస్థలలో ఇది ఒకటి అని తెలిపారు. దేశవ్యాప్తంగా 4,000కు పైగా పాఠశాలలను 14 ప్రధాన ప్రమాణాల ఆధారంగా విశ్లేషిస్తుందని, ఈ సర్వేలో 8,000 మందికి పైగా తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యా నిపుణుల అభిప్రాయాలు తీసుకుని ర్యాంకులు కేటాయిస్తారని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ శరత్ తేజ ఆదిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల ఆంధ్రప్రదేశ్‌లో 12వ స్థానం, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 6వ స్థానం సాధించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత ఉన్నతమైన విద్యా ప్రమాణాలపై కట్టుబడి పనిచేయాలనే బాధ్యతను కూడా తమకు ఉందని తెలిపారు.



గుర్తింపు పత్రాన్ని ఇస్తున్న నిర్వాహకులు

ఎపిఐఇఇ అసోసియేషన్ కార్యదర్శిగా మురళీమోహన్

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్.మురళీమోహన్ ఎపి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ పి.శిరిషారాణి అధ్యక్షతన మురళీమోహన్‌ను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎ.జనార్ధన్‌రావు, ఎమ్.మెహన్‌రావు, పి.సుబాషిణి, పి. సుర్వాశ్రీ, బి.గోవిందరావు, ఎస్ఎల్ఎన్‌వి.ఉదయ్‌కుమార్, ఎన్. శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

బొప్పరాజును కలిసిన కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్- కం- కంప్యూటర్ ఆపరేటర్లు సంఘం ప్రతినిధులు ఇటీవల రాష్ట్ర స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసు అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లును తమ సమస్యలపై కలిశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి ఏపీ రెవిన్యూ సర్వీసు అసోసియేషన్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పివి.రత్నాన్ని, ఏపీ జేఏసీ అనకాపల్లి జిల్లా చైర్మన్ ఎస్ఎస్‌విఎస్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలసి సమస్యలు విన్నవించారు.

అప్రమత్తత లేకుంటే ప్రాణాలు ఆవిరే

బాణసంచా తయారీ కేంద్రాల్లో తరచూ ప్రమాదాలు

దీపావళి మాటున జనావాసాల్లో వ్యాపారాలు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్

దీపావళి వచ్చేస్తుంది... అదే సమయంలో అప్రమత్తత లేకుంటే ప్రాణాలకే ముప్పే. ఇటీవల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం, కొమరిపాలెంలో మందు గుండు సామాగ్రి తయారీ కేంద్రంలో పేలుళ్లు సంభవించి ఆరుగురు సజీవదహనం కాగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే కాదు గతంలో అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీనికి కారణం నియమాలు సక్రమంగా పాటించకపోవడం, తగు జాగ్రత్తలను తీసుకోకపోవడమే. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ పోలీస్ యంత్రాంగం మామూళ్ల మత్తులో వదిలేస్తున్నారు. దీంతో వ్యాపారాలు ఏమోగానీ సామాన్యులు చాలామంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాలపై జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సి ఉంటుంది. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ దృష్ట్యా స్పష్టమైన మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం జారీ చేసినా, అమల్లో చిత్తశుద్ధి కరువవడంతో సామాన్యులకు ముప్పు కలుగుతుంది. అనకాపల్లిలో చాలామట్టుకు అమ్మకాలు రూల్స్ విరుద్ధంగానే సాగుతుంటాయని ఆరోపణలు ఉన్నాయి. నిజానికి నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయాలి, ఆయా ఫ్యాక్టరీలు, షాపులను వెంటనే సీజ్ చేయాలి. ఎక్స్‌ప్లోసివ్స్ యాక్ట్ కింద ఫిర్యాదులు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవలసి ఉంది. ఇటువంటి చర్యలు జిల్లాలో పెద్దగా కాన రావడం లేదు. జనావాసాల మధ్య అక్రమ విక్రయాలు చేసే దుకాణాలపై పోలీస్, ఫైర్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా దాడులు జరిపి స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ప్రమాదాలు జరిగాక ముందే స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తయారీ కేంద్రాలు పాటించాల్సిన ముఖ్య నియమాలు

1. ఎక్స్‌ప్లోసివ్స్ యాక్ట్, 1884 మరియు ఎక్స్‌ప్లోసివ్స్ రూల్స్, 2008 ప్రకారం మాత్రమే తయారీ కేంద్రాలకు లైసెన్స్ ఇవ్వబడుతుంది. యాక్ట్ ప్రకారం సరిగా లేని వాటికి తయారు చేసే లైసెన్స్ లేనట్టే.
2. మందుగుండు తయారీ కేంద్రాలను జనావాసాలకు కనీసం 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి.
3. ప్రతి కేంద్రంలో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, సాండ్ బాక్స్, వాటర్ డ్రమ్స్ ఉండాలి.
4. సిబ్బంది బ్లాస్టింగ్ మెటీరియల్ హ్యాండ్లింగ్‌పై శిక్షణ పొందిన వారై ఉండాలి.
5. ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు మాత్రమే కార్యకలాపాలు జరగాలి.

అమ్మకాలు చేసే షాపులు పాటించాల్సిన నియమాలు

1. జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు విభాగం, ఫైర్ సర్వీసుల అనుమతితో మాత్రమే తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేయాలి. చాలా మట్టుకు పర్మిషన్ లేకుండానే అమ్మకాలు చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఒక లైసెన్స్‌పై అనేక మంది వ్యాపారాలు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి.
2. మందుగుండు సామాగ్రి అమ్మకాలు జనావాస ప్రాంతాలకు కనీసం 100 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి.
3. ప్రతి షాపులో ఫైర్ ఎక్స్టింగ్విషర్, నీటి బకెట్లు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా ఉండాలి
4. లోపభూయిష్టమైన లైటింగ్, హీటర్‌లు లేదా తెరవెనుక మంటల ఉపయోగం నిషేధం.

నర్సీపట్నంలో రహదారి అస్తవ్యస్తం

ప్రజాశక్తి-నర్సీపట్నం:డివిజన్ కేంద్రం నర్సీపట్నం ప్రధాన రహదారి గోతులుగా తయారైంది, దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడడంతో పాటు పలుచోట్ల ట్రాఫిక్కు కూడా అంతరాయం ఏర్పడుతోంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో పాఠశాలలకు వెళ్లే బస్సులతో పాటు వివిధ పనులపై కార్యాలయాలకు వాణిజ్య పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నర్సీపట్నంలోని మంగీలాల్ స్వీట్స్ స్టాల్ ఎదురుగా రోడ్డు ధ్వంసమై చిద్రమై పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పలుమార్లు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. నర్సీపట్నం బస్ స్టేషన్ సమీపంలోనే ఈ గోతులు ఏర్పడడంతో ఇన్ గేటుకు వెళ్లే బస్సులు సకాలంలో లోపలికి వెళ్లక పోవడంతో ట్రాఫిక్కు మరింత అంతరాయం ఏర్పడుతుంది.

పెద్దబొడ్డేపల్లి ప్రధాన కూడలి, డిగ్రీ కళాశాలకు వెళ్లే చింతపల్లి రోడ్డు, గొలుగొండకు వెళ్లే రోడ్డు, నర్సీపట్నం నుంచి కోటవురట్ల వెళ్లే రోడ్డుకు ఇదే దుస్థితి నెలకొంది. రోడ్లు మరమ్మతులు చేపట్టాలని పి జి ఆర్ ఎస్ లో కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని నగరానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కూటమి ప్రభుత్వ నాయకులు ఇప్పటికైనా స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



గొయ్యి పడిన రహదారి



గోతుల రోడ్డుపై వెళుతున్న వాహనదారులు



పుస్తకాలు ఇస్తున్న దాత

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖ గ్రంథాల యంలో గురువారం శాఖా గ్రంథాలయానికి ప్రముఖ విద్యావేత్త ఎం.వి.డి.వి. ప్రసాద్ (రిటైర్డ్ పి.డి) తన కుమారులు విమల్ తేజమన్నే పేరు మీదగా వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలతో పాటు వాటిని భద్రపరచుటకు ఒక ఆల్మరాను కూడా గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయాధికారిణి పీ. దమయంతి పుస్తకాలను స్వీకరించారు. అనంతరం గ్రంథాలయంలో చదువుతున్న యువతీయువకులు, నిరుద్యోగులు పుస్తకాలను అందచేసిన ప్రసాద్, ఆయన కుటుంబానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



అభినందిస్తున్న నేతలు

నూతన ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి-కొత్తకోట:ఇటీవల మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికై రావికమత మండలంలో వివిధ హైస్కూల్లో బాధ్యతలు స్వీకరించిన సుమారు 30 మంది ఉపాధ్యాయులకు రావికమతం మండల పి ఆర్ టి యు తరఫున కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా ఉపాధ్యాయ విధులలో చేరిన వారికీ తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శి జిపి ఎస్ నాయుడు తెలిపారు. మండలం లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, అన్ని రకాల సర్వీసు లు అందిస్తామన్నారు. సర్వీస్ రిజిస్టర్, నూతన ఉపాధ్యాయులకి అవసరమైన అన్ని రకాల ఫారంలు అందించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీరప్రకాష్, వి.రాజశేఖర్, పి.ఆర్.టి.యు. నాయకులు దొర, రమణాజీ, శంకరరావు, అప్పలనర్సయ్య పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బోయ తేలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జి.మాడుగుల సిఐ శ్రీనివాస్, ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాడేరు డి.ఎస్.పి షేకు సహబాద్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ కేర్ హాస్పిటల్‌కి సంబంధించిన వైద్యులతో వైద్య శిబిరాన్ని పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలో అప్పల రాజుపురం, కండివరం, సిరిజం, జైతవరం గ్రామాలలో వరి పంటపై సుడిదోమ, ఆకు ముడత, పొడ తెగులు వంటి తెగులును కొండంపూడి శాస్త్రవేత్తలు గురువారం పర్యటించి పరిశీలించారు. శాస్త్రవేత్తలు వరిలో పొటాష్ లోప లక్షణాలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆకు ముడత పురుగు ఆకుల పత్ర హరితాన్ని తిని వేయడంతో ఆకులు ముడుచుకు పోయి తెల్లగా కనిపిస్తాయన్నారు. సుడిదోమ(దోమపోటు) పురుగు ఆశించిన పొలంలో వరి పంట సుడులు సుడులుగా ఎండిపోతుందన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పంట కాలిపోయినట్లుగా కనిపిస్తుందన్నారు. యూరియా ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పాము పొడ తెగులు(పాసి తెగులు) తెగులు ఆశించిన వరి ఆకులపై బద్దీల మాదిరి మచ్చలు ఏర్పడి ఆకులు ఎండి పోతాయన్నారు. వరి పొలం గట్లను ఎప్పటికప్పుడు గడ్డి లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్. ఎన్.సత్తిబాబు, శాస్త్రవేత్తలు సౌజన్య, తులసీమణి, మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

డ్రోన్‌ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో కొత్తకోట గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నానో యూరియా వినియోగం -డ్రోన్ వాడకం పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీదేవి మాట్లాడుతూ, నానో యూరియా ఒక ఎకరానికి 450 ఎం ఎల్ లీటర్ల నీటిలో పిలకలు దశలో, పొట్ట దశలో, రెండు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. దీనిద్వారా మొక్క వినియోగం బాగుంటుందన్నారు. కె వై కె శాస్త్ర వేత్త రాజకుమార్ మాట్లాడుతూ, వరిలో ప్రస్తుతం సుడిదోమ కన్పిస్తుందని, దీని నివారణకు ఎకరానికి 300 గ్రాములు ఎపిసెట్ లేదా డయనతో పురాన్ 100 గ్రాములు మందును పైర్ పై పిచికారీ చేయాలని సూచించారు. శాస్త్ర వేత్త సత్తిబాబు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రికరణ విభాగం, వ్యవసాయ పనిముట్లు ఉద్యాన పంటలు గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్ బాబు, బిటిఎమ్ లక్ష్మి కిషోర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి



సీమంతాలు చేస్తున్న నాయకులు, సిబ్బంది

ప్రజాశక్తి-నక్కపల్లి:అందరూ పోషకాహారం తీసు కునేలా అవగాహన కల్పించాలని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పలువురు నాయకులు అన్నారు. నక్కపల్లిలో ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందించడం జరుగు తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత, ఎదుగుదల, బరువు లోపాలు ఉన్న వారిని గుర్తించి వారికి పోషకాహారం పై అవగాహన కల్పించాలని అంగన్వాడీలకు సూచించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహిం చారు. పోషకాహార స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మండల మహిళా అధ్యక్షురాలు ఫాతిమా మున్నిషా, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, పంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు, నాయకులు నూకరాజు, వైబోయిన రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు లలిత, సత్యవతి, నిషా, దుర్గ, హైమ, సత్య సుజాత, రంజాన్ బేబీ, మున్నిషా, అంగన్వాడీలు పాల్గొన్నారు.



నూతన సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా బిఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:బిఎస్ఎన్ఎల్ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భ ంగా నర్సీపట్నం బి.ఎస్.ఎన్.ఎల్ కార్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాడేరు బి.ఎస్.ఎన్.ఎల్ డిఇ శ్రీ సత్య శ్రీనివాస్ పాల్గొని తాజా సేవలు, నూతన ప్లాన్లు, ఆఫర్లను వివరంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మరింత వేగవంతమైన టెలికమ్యూనికేషన్ సేవలను అందించేందుకు బి.ఎస్.ఎన్.ఎల్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. 4జీ సేవలను త్వరలో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి మాడుగుల:మండలంలోని పొంగలిపాక గ్రామస్తులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని చూడకుండా తమ గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్న ఆలోచనతో గురువారం గ్రామ పెద్దలు, యువత నడుం బిగించారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా వున్న పిచ్చి మొక్కలను తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీల పరిశుభ్రత కు కూడా ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయన దేవుడమ్మ, సత్యనారాయణ, కింతలి పిఏసిఎస్ పర్సన్ ఇంఛార్జ్ ఉండూరు దేవుడు, ఎంపీటీసీ మైచర్ల సన్యాసిరావు, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు శెట్టి సత్తిబాబు, కర్ణం పోతు రాజు, జనసేన కార్యకర్తలు, పచ్చికూర నాగు, ఉండూరు కుమార్, పాల సంఘం అధ్యక్షులు జోగి నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు బంటుమల్లు నాయుడు, పచ్చి కూర ఎరుకు నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ దట్ల రవి పాల్గొని సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డుకు ఇరువైపులా వున్న తప్పులను తొలగించారు.



తుప్పలను తొలగిస్తున్న గ్రామస్తులు



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

ఎన్ఎంఎంఎస్ పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: హైస్కూల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సహాయపడే మెంటల్ ఎబిలిటీ పుస్తకాలను జనవిజ్ఞాన వేదిక ప్రచురించింది. ఈ పుస్తకాలను నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి సి.హెచ్. తలుపులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి దోహదం చేసే ఎంతో ఉపయుక్తమైన మెటీరియల్‌ను అందించిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావుకి, సంస్థ నాయకత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ పుస్తకాలను వినియోగించుకొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, జిల్లా నాయకులు కురచా జోగినాయుడు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్నికం మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-రావికమతం: రావికమతం మండలం గర్నికం పంచాయితీ మాజీ సర్పంచ్ ఆర్ది నూకరాజు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గ్రామంలో ప్రజలు శోక సముద్రంలో మునిగి పోయారు. ఆయన రెండు పర్యాయాలు గర్నికం గ్రామ పంచాయతీ సర్పంచిగా, రావికమతం మండల వైస్‌చైర్మన్గా, రావికమతం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా, విశాఖ డైరీ డైరెక్టర్ గా అనేక పదవులు అలంకరించారు. సౌమ్యుడిగా పార్టీలకతీతంగా, మండలంలో ఒక సీనియర్ నాయకునిగా చక్రం తిప్పి ఎదిగారు. ఆయన పెద్ద కుమారుడు ఇటీవల మరణించగా, రెండవ కుమారుడు పెద్దేరు రిజర్వాయర్ వైస్ చైర్మన్గా ఉన్నారు.



ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -మాడుగుల: ఈనెల 23 నుండి 30వ తేదీ వరకు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సేవలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం వద్ద మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. తమ బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని. నెలసరి వేతనలు పెంచాలని పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మోసియా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, ఐదు నెలల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెలలు తరబడి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబాలు ఆకలితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమం ఉధృతం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దూరు. ఈశ్వరరావు, ఎస్. రాంబాబు, డి.కృష్ణవేణి, టి.రత్నకుమారి గిరిజన సంఘం మండల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు రద్దు చేయాలి

అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన దీక్ష ▸ మత్స్యకారులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి: నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని, మత్స్యకారులపై ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ గురువారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ "బల్క్ డ్రగ్స్ పార్కు వద్దు -గంగమ్మ తల్లి ముద్దు" అంటూ నెల రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మత్స్యకారుల పోరాటాన్ని అణచివేయడానికి కుట్రపూరితంగా ప్రభుత్వం చేస్తున్న నిర్బంధాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. రాజయ్యపేటలో నెల తరబడి సెక్షన్-30ని అమలు చేస్తున్నారని, పోలీసు పికెట్లు పెట్టి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటానికి మద్దతు తెలుపుతున్న సిపిఎం, ఇతర పార్టీల నాయకులను గృహనిర్బంధం చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలపై నిర్బంధం ప్రయోగించి, ఉక్కుపాదం మోపి ప్రజలు జీవించే హక్కును, నిరసన చేసే హక్కును ఖూనీ చేస్తున్నారని తెలిపారు. విషతుల్య పరిశ్రమలకు తాను వ్యతిరేకమని, బల్క్ డ్రగ్ పార్కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని గత ఎన్నికల ముందు చెప్పిన హోంమంత్రి అనిత నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాభీష్టం మేరకు బల్క్ డ్రగ్ పార్కు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్ శంకరరావు, వివి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ఆర్ దొరబాబు, వైఎన్ భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నేత బొట్టా చిన్నియాదవ్, రైతు కూలీ సంఘం నేత కె.మోహన్‌రావు, రైతుసంఘం నేతలు గండి నాయనబాబు, కాళ్ళ తేలయ్యబాబు, అల్లు రాజు, మహిళా సంఘం నేతలు పరమేశ్వరి, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

5వ షెడ్యూల్‌లో చేర్చాలని..గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట: నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రోలుగుంటలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.గోవిందరావు మాట్లాడుతూ రోలుగుంట మండలంలోని అర్ల, పిత్రిగెడ్డ, లోసింగి, పెద్దగరువు, గుర్రాలబయలు, కొరుప్రోలు, ఎంపేట, పనసలపాడు, గంగవరం గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు 30 సంవత్సరాల నుండి అటవీ భూమిలో జీడిమామిడి అపరాలు వంటివి సాగు చేస్తున్నారని అన్నారు. వీరికి ఇప్పటికి పట్టాలు ఇవ్వలేదని, తక్షణమే అటవీ హక్కులు కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, గిరిజన సంఘం నాయకులు కొర్ర కొండబాబు, చంద్రరావు, ఆదివాసీలు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న నాయకులు

ఖరీఫ్ ఇ-పంట నమోదు పూర్తి చేయాలి

- జిల్లాలో ధాన్యం సేకరణకు 63 కేంద్రాలు ఏర్పాటు
- బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు తనిఖీ చేయాలి
- జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఖరీఫ్ సీజనుకు సంబంధించి వరిపంటకు ఈ-పంట వివరాలు నమోదు ప్రక్రియ అక్టోబరు 25 నాటికి పూర్తి చేయాలని జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుండి రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, సివిల్ సప్లయి మండల అధికారులతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇ-పంట నమోదు, ధాన్యం సేకరణ, పిజిఆర్ఎస్, రీసర్వే, ఐవిఆర్ఎస్, నీటితీరువా, ఓటరు మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు జిల్లాలో 63 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు రవాణా, గోనె సంచులు సమకూర్చుకుంటే సదరు ఖర్చులు నేరుగా వారికే చెల్లించడం జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులకు అవసరమైన ఇంటి స్థలాలను ప్రస్తుతం గల లేఅవుట్లలో ఖాళీలలో భర్తీ చేయాలని, అదనంగా భూమి అవసరమైతే నివాసానికి అనుకూలమైన ప్రభుత్వ భూమిని గుర్తించి సేకరించాలని ఆదేశించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో ఇళ్ల నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషను చేయుటకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా క్రయవిక్రయాలు పెరుగుతాయని, తయారీ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు వెరిఫికేషను పూర్తి చేసిన పిదప, ప్రతి ఓటరు మ్యాపింగు చేయాలన్నారు. ఓటరు చేర్పులకు సంబంధించి 40 సంవత్సరాల లోపు వయస్సు గల వారిని మాత్రమే కొత్త ఓటరు రక్తసంబంధీకుల ఓటును లింకు చేసి నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు పి.జయంతి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ఎఎంఎఎల్ కళాశాలలో ఎన్‌సిసి సెలక్షన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో 13 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌సిసి ఆర్మీ విభాగంలో కాడెట్స్ సెలక్షన్ జరిగింది. ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 246 మంది కాడెట్స్ పాల్గొన్నారు. బెటాలియన్ నుండి వచ్చిన పిఐ స్టాఫ్ సుభేదార్ శేఖర్, నాయక్ దేవేందర్ రావత్, హవల్దార్ చంద్ర శేఖర్, హవల్దార్ జనార్దన్, జిసిఐ హారిక కాడేట్స్‌కు ఎత్తు, రన్నింగ్, బరువు, మెడికల్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం రాతపరీక్ష ద్వారా 71 మంది కాడేట్స్‌ను సెలెక్ట్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు మాట్లాడుతూ ఇదే ఉత్సాహాన్ని ముందు ముందు చూపించి బి, సి సర్టిఫికెట్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కళాశాల ఆర్మీ విభాగం నుండి కేతిరెడ్డి శ్యామల 2025 ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొని మంచి పేరు తీసుకువచ్చిందని, ప్రతి సంవత్సరం జరిగే అగ్నివీర్ ర్యాలీలో అనేక మంది కాడెట్స్ సెలెక్ట్ అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, కెప్టెన్ ఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



ఎన్‌సిసి కేడెట్లను ఎంపిక చేస్తున్న అధికారులు